## ఇంటింటి లెక్చర్లు (11)
# కన్ఫ్యూజన్ ముట్టడి

నిత్య జీవితంలో మనం చేయవలసిన పని ఒక క్రమంలో వుంటే ఒకటి వెంటొకటి చక చకా చేసుకుంటూ పోవచ్చు. అలాకాక యివాళ కాదు రేపు రేపుకాదు ఎల్లుండి అని పనులను దాటవేస్తూపోతే-అన్నీ పేరుకు పోయి ఒక్కమాటు మనమీదకి తిరగబడే ప్రమాదం వుంది.

చిన్నపనులే దాటవేస్తే అవి మారిపోయి సమస్యలుగా మారుతాయి.

ఓ బల్బు మాడిపోయిందనుకోండి అది తెద్దాం తెద్దాం అని బద్ధకించగానే మరో బల్బుకూడా గోవిందా అంటుంది. ఈలోగా మనింటికొచ్చిన చుట్టాలు అ చీకట్లో తడుముక్కొడి జారి పడటమో, బట్టల వంక బట్టలతో సహా కిందకు లాగెయ్యడమో, మరొకరిబనినో అండర్ వేరో, చొక్కానో తొడుక్కోవటమో యిలాటిదే ఏదైనా జరగవచ్చు. పాతవాళ్ళు చీకట్లో అలవాటు కొద్దీ సులువుగా తిరగ్గల్రు కాని కొత్తవాళ్ళు కంగారులో అన్నీ పొరపాట్లే చేస్తారు.


హోల్డాలు చేతిసంచి సజ్జ బుట్టల్లాంటివి యింటి దగ్గర ఏమీ ఎరగనట్లు మర్యాదగానే వుంటాయి. వీధిలో కెళ్ళగానే ప్లాట్ఫాం మీద హోల్డాలు బెల్టులు ఫట్ ఫట్ మని తెగిపోతాయి అప్పుడది పొట్టవిచ్చుకుని నానా అసహ్యంగానూ దర్శనమిస్తుంది. "హోల్డ్ ఆల్" అన్నారుగాని

జె. వి. రమణయ్య గ్రామరు ప్రకారం "హోల్డ్స్ ఆల్" అనాలి. హోల్డా లుకి బహువచనం "హోల్డాల్సు" ఏవీబాగులేదు. చేతి సంచి కూడా దాని తాడుతెగ అన్నట్లు ఠపీమని తెగి పూరుకుంటుంది. ఆ స్థితితో ఆ సంచిని కాలవలోకి గిరాటేసి వెళ్ళిపోవాలనిపిస్తుంది. దాన్ని వదలలేం. దాన్ని చేత పుట్టుకోవడం మనకు చేతకాదు. అది మనల్ని చూసి వెక్కిరిస్తున్నట్లుం టుంది. ఏం చేస్తాం? సజ్జ బుట్టలుకూడా అంతే— ఓ సైడుకి ముసలమ్మల్లా వంగి, నేలమీద సరిగ్గా నిలబడకుండా పడిపోతాయి చోటులేకపోతే. మర చెంబు కూడా వొర్లిపోతుంది రైలు కుదుపుకి, బస్సు కుదుపుకి. ఇవన్నీ చిన్నచిన్న వస్తువులేకాని తల్చుకుంటే మనజీవితాన్ని దుర్భరం చేసి మనకు పిచ్చెత్తించగలవు. అంచేత వీటన్నిటనీ ఒక ఆర్డరులో వున్నాయో లేవో చూసుగోకుండా ప్రయాణాలు పెట్టుగోకూడదు. క్రమశిక్షణ ఆల్సో బిగినెట్స్ హోమ్.

రిస్టువాచీ స్ట్రాప్ తెగిపోయిందనుకోండి. ఆలారం టైంపీసు స్ప్రింగు విరిగిందనుకోండి. సూట్‌కేస్‌కి హేండిలు వూడొచ్చిందనుకోండి ఇవన్నీ చిన్న పనులేకాని పోస్టుపోన్ చేసిన కొద్దీ వీటిఅన్నిటి సామూహిక ఒత్తిడి మనల్ని పిచ్చిముండాకొడుల్ని లేదా కూతుళ్ళని చేసి పారేస్తుంది.

అన్ని పనులూ మనం చేసుకోడం మంచిదే. కాని అన్ని పనులూ మనం చేసుకోవడం వలన కొన్నాళ్ళకి ఎవరేపని చేసిపెట్టినా అది మనకు నచ్చకుండా పోతుంది. జానకి ఆఫ్ ఆల్ ట్రేడ్స్ మాస్టరాఫ్ నన్ అనిపించు గోవాలనిపోస్తుంది. ప్రతి పనిలోనూ వేలు పెట్టడం వలన ఏకీ సరిగాచేయక యితరుల్ని చేయనివ్వక "అమ్మబాబోయ్-అన్నీ నేనే చేసుకు ఛస్తున్నా నర్రా నాకు దిక్కు లేదర్రా" అని సెల్ఫ్ పిటీకోసం ఫిట్లు తెచ్చుకోవడం మామూలైపోతుంది. ఇళ్ళు కడిగింగ్, గిన్నెల్ వాషింగ్, అల్మారు సర్దిం గులన్నీ మనం చేశాక బట్టల వాషింగ్, బియ్యం ఏరింగ్. పప్పులెండ బెట్టింగులన్నీ మనవేచేస్తే అనక లోబ్లడ్ ప్రెషరొచ్చినా రావచ్చు— ఇప్పుడు నేను దుక్కలా వున్నాను. ఫుట్‌బాల్‌లా గున్నాను. శాండోలా గున్నాను. సర్కస్‌గుర్రల్లాగున్నాను అని ఆడవాళ్ళు చెప్పుగోవటం మర్యాద

కాదు. ఫ్యాషన్ అంతకంటే కాదు. అప్పే—తింటే యింతకూడా అరగటం లేదమ్మా మా వారు గులాబ్‌జామ్ నోటికందిచ్చేసరికి మింగలేక పనిమని షికి పారేశాను అనాలి. తలనొప్పిఅనో, వీక్నిస్సు అనో కాళ్ళు దడదడ లాడుతున్నాయనో, గుండె గుబగుబలాడుతున్నాదనో. హై బ్లడ్ ప్రెషరనో లో బ్లడ్ ప్రెషరనో చెప్పుకోవాలి. కాని "మకేం రోగాల్లేవు. మేం దిమ్మ




చెక్కల్లాగున్నాం" అని చెప్పుకోవడం నాగరికత కాదు. ముఖ్యంగా నవ నవలాడే లేడీస్ విషయంలో. ఆవిడకేం ఆవిడ శరీరం నల్లరాయి. పిడుగు లాటి మనిషి అనిపించుకోడం అవుటాఫ్ ఫాషన్.

కొన్నాళ్ళు సర్వీసు పుటప్ చేశాక ఇల్లాలు కొన్ని స్మాల్ బిజినెస్సు లన్ని ఎత్తికట్టెయ్యాలి. లాండర్ వర్క్ తగ్గించెయ్యాలి. ఇల్లు సర్దింగులు గిన్నెల వాషింగులు మానుకోవాలి షాపింగ్, ట్యూటరింగులు తప్పించు కోవాలి. హోంవర్క్ పోర్టుఫోలియోలుగా విభజించి అందరికీ పంచాలి. ఈ విధంగా అధికారాలను శాఖలవారీగా విభజిస్తే బాగుంటుందని నా అయి డియా—-

1) అకౌంటింగు మరియు ఆడింగు—(పద్దులురాయుట)
పెద్ద అమ్మాయి లేదా పెద్దబ్బాయి

2) కూరలు. బజారుచేయడం—
రిటైరయిన మామగారు, నిరుద్యోగి మరిది లేదా భర్త లేదా పెద్ద అబ్బాయి.

3) పక్కలు వేయటంఎత్తటం సుప్రభాత సేవలు ఎవరికి వారే లేదా పెద్ద అమ్మాయి

4) నీళ్ళు కాచటం (స్నానాలు)— పనిమనిషి, రిటైరయిన మావగారు మేనత్తలు కాని నాయనమ్మలు, అమ్మమ్మలు కాని లేదా నాయనమ్మలు కాని లేదా ఎవరికి వారే.

5) బియ్యం ఏరింగ్—
అత్తగారు ఆడపడుచులు, కూర్చోనే అతిధుల్లోని ఆడవారు పెళ్ళికాని కన్యలు.

6) కూరలతరుగుట—

—డిటో—

7) కాఫీటిఫిన్లు—
గృహ యజమానురాలు లేదా ఆమె అక్కగారు కొండొకచో చెల్లెలు, అప్పుడప్పుడు పెద్ద అమ్మాయి, పెళ్లికాని ఆడబడుచులు—

8) బట్టలుతకటం—
గిన్నెలు కడగటం-
పనిమనిషి, రజకులు లేనిచోట ఇంటిల్లిపాదీ.

9) పెద్దపిల్ల పెద్దఅబ్బాయి. చిన్నపిల్లల్ని బళ్లోకి పంపడం, చదువులు.

10) లా అండ్ ఆర్డర్—
ఇల్లాలు ఆమె భర్త

11) ఆర్థిక విషయాలు—
ఇల్లాలు ఆమె భర్త

12) పూజలు, వ్రతాలు, ఆచారాలు—
అత్తగారు, మావగారు విధవ మేనత్త వగైరాలు.

13) ప్రయాణాలు....
భర్త పెద్ద పిల్లాడు

14) అనారోగ్యాలు వైద్యం....
భర్త, ఇల్లాలు.

15) పోట్లాడలు ఇరుగు పొరుగుతో—
ఇంటిల్లిపాదీ

ఇవన్నీ ఇలా విడగొట్టి ఎవరి పనులువారు చేసుకుంటే సంసారం బోల్తాకొట్టకుండా సజావుగా సాగిపోతుంది. అట్లాకాక అన్నీతనే చేయాలనుకునే అమ్మ ఎవరైనావుంటే అచిరకాలంలో పిచ్చాసుపత్రికైనా వెళ్తుంది లేదా తనున్న యింటినే పిచ్చాసుపత్రిగా మార్చివేస్తుంది.